క్లుప్తంగా

రేపు ప్రముఖ వైద్య నిపుణులు రాక

పులివెందుల : పట్టణంలోని స్థానిక భాకరాపురంలో ఉన్న దినేష్ మెడికల్ సెంటర్(గంగిరెడ్డి ఆసుపత్రి)లో ఆదివారం ప్రముఖ వైద్య నిపుణులు రానున్నట్లు ఆసుపత్రి వర్గాలు తెలిపాయి. చర్మవ్యాధుల ప్రముఖ వైద్య నిపుణురాలు డాక్టర్ ఎస్.సౌజన్య సోరియాసిస్, తామర, గజ్జి, ఫంగస్ ఇన్ఫెక్షన్, మొటిమలు, బొదులు, దద్దుర్లు, చుండ్రు తదితర చర్మ వ్యాధులకు వైద్య పరీక్షలు నిర్వహించనున్నారు. ప్రముఖ న్యూరో సర్జన్ డాక్టర్ క్రాంతికుమార్ మెదడు, వెన్నముక, నరాలు, తిమ్మిర్లు, వంటి ఒళ్లు నొప్పులకు వైద్య చికిత్సలు అందిస్తారన్నారు. కర్నూలు విశ్వభారతి ఆసుపత్రి నుంచి ప్రముఖ గుండె జబ్బుల వైద్య నిపుణులు డాక్టర్ హితేష్‌రెడ్డి గుండె జబ్బులకు సంబంధించి వైద్య పరీక్షలు నిర్వహిస్తారన్నారు. ఈ అవకాశాన్ని పులివెందుల ప్రాంత ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. మరిన్ని వివరాలకు 9963170177, 08568286189 అనే ఫోన్ నెంబర్లకు సంప్రదించాలన్నారు.

ఘన వీడ్కోలు



పదవీ విరమణ పొందిన రాధాకృష్ణకు జ్ఞాపికను అందజేస్తున్న ఎస్‌పీఎఫ్ అధికారులు

ఎర్రగుంట్ల : డాక్టర్ ఎంవీఆర్ ఆర్టీపీపీలో పనిచేస్తున్న ఎస్‌పీఎఫ్ అసిస్టెంట్ కమాండ్ కె.రాధాకృష్ణ పదవీ విరమణ సందర్భంగా శుక్రవారం ఘనంగా వీడ్కోలు నిర్వహించారు. ఆర్టీపీపీ ఇన్‌చార్జి ముఖ్య ఇంజనీర్ సోమశేఖర్‌రెడ్డి, ఎస్‌పీఎఫ్ కమాండర్ ఎస్ఎం బాషా, రిజర్వ్ ఇన్‌స్పెక్టర్ రమేష్‌లు రాధాకృష్ణను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో సీనియర్ పర్యవేక్షణ అధికారులు దేవేందర్‌నాయక్, ప్రసాద్, జీఎం బాలాజీ, కడప ఎయిర్‌పోర్టు అసిస్టెంట్ కమాండర్ ఆనందయ్య, ఆర్టీపీపీ అధికారి సిద్దయ్య, యూనియన్ నాయకులు, ఉద్యోగులు పాల్గొన్నారు.

రుతుక్రమం సమయంలో పరిశుభ్రత పాటించాలి



ర్యాలీ నిర్వహిస్తున్న మహిళలు

వేంపల్లె : మహిళలు రుతుక్రమం సమయంలో పరిశుభ్రత పాటించాలని ఐసీడీఎస్ ప్రాజెక్టు డైరెక్టర్ సునీత తెలిపారు. శుక్రవారం పట్టణంలోని వేంపల్లె సెక్టార్–2లో రామిరెడ్డిపల్లె అంగన్‌వాడీ సెంటర్లో రుతుక్రమం సమయంలో పరిశుభ్రత, జాగ్రత్తలు గురించి కిశోర బాలికలు, వారి తల్లులకు అవగాహన కల్పించామన్నారు. ముఖ్యంగా ఆడపిల్లలు ప్రాముఖ్యత, లింగ వివక్షత గురించి వివరించడం జరిగిందన్నారు. అనంతరం గ్రామంలోని పురవీధుల్లో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో సూపర్ వైజర్ నాగరత్న, పంచాయతీ కార్యదర్శి లలితమ్మ, సీహెచ్ఓ మహమ్మద్ తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయులకు సన్మానం



ఎంఈఓ నారాయణరెడ్డిని సన్మానిస్తున్న ఉపాధ్యాయులు

లింగాల : మండలంలో పదవి విరమణ పొందిన ఉపాధ్యాయులను శుక్రవారం మండల కేంద్రంలోని ఎమ్మార్సీ కార్యాలయంలో ఘనంగా సన్మానించారు. ఎంఈఓ ఎం.వి.నారాయణరెడ్డి, బోనాల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల హెచ్ఎం నిరంజన్‌రెడ్డి, ఎగువలింగాల ప్రాథమిక పాఠశాల హెచ్ఎం ఉమాదేవిలను వివిధ పాఠశాలల ఉపాధ్యాయులు, ఎమ్మార్సీ కార్యాలయ సిబ్బంది సన్మానించారు. కార్యక్రమంలో పలువురు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

గుండెపోటుతో వైఎస్సార్‌సీపీ కార్యకర్త మృతి



శ్రీనివాసులు మృతదేహం వద్ద నివాళులు అర్పిస్తున్న వైఎస్ మధురెడ్డి

తొండూరు : మండలంలోని వడ్డెర కాలనీకి చెందిన వైఎస్సార్ సీపీ కార్యకర్త శ్రీనివాసులు(46) గురువారం రాత్రి గుండెపోటుతో మృతి చెందినట్లు ఆయన బంధువులు తెలిపారు. ఈ విషయం తెలుసుకున్న తొండూరు మండల వైఎస్సార్ సీపీ ఇన్‌చార్జి వైఎస్ మధురెడ్డి మృతుడి నివాసం వద్దకు వెళ్లి నివాళులు అర్పించారు. శ్రీనివాసులు కుటుంబానికి అన్ని విధాల అండగా ఉంటామన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర డైరెక్టర్లు, రవీంద్రారెడ్డి, సురేష్‌రెడ్డి, జిల్లా ఉపాధ్యక్షుడు శశికాంత్, నాయకులు జనార్ధన్‌రెడ్డి, బంగారు మునెయ్య, భాస్కరరెడ్డి, రాఘవరెడ్డి, కృష్ణారెడ్డి, రమణయ్య తదితరులు పాల్గొన్నారు.

పులివెందులలో విస్తారంగా అరటి సాగు



పులివెందులలో సాగులో ఉన్న అరటి పంట



ఏపుగా పెరిగిన అరటి గెల

పులివెందుల రూరల్ : నియోజకవర్గ పరిధిలోని ఏ గ్రామంలో చూసినా అరటిపంటను రైతులు సాగు చేస్తున్నారు. ప్రస్తుత కాలంలో అరటి పంటలు అన్నదాతలకు సిరులు కురిపిస్తున్నాయి. ఒకప్పుడు అరటి పంట పెట్టాలంటేనే పెట్టుబడులు కూడా వచ్చేవి కావని రైతులు ఆవేదన వ్యక్తం చేసేవారు. కానీ ఇప్పుడు హెక్టారుకు లక్షలకు పైగా ఆదాయం వస్తుందని ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. రోజురోజుకు అరటి ధరలు పెరుగుతుండటంతో రైతులు ఎక్కువగా సాగుచేసున్నారు. 3, 4 నెలల క్రితం టన్ను రూ.5 వేల నుంచి రూ.8వేలు ధర ఉండేది. ఇప్పుడు మార్కెట్‌లో రూ.15 వేల నుంచి రూ.20 వేలకు పెరగడంతో రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం అందిస్తున్న ప్రోత్సాహంతో ఉత్సాహంగా రైతులు పండ్ల తోటలను సాగు చేస్తున్నారు. జీ9 రకం అరటికి మంచి గిరాకీ ఉందన్నారు. కర్ణాటక, మహారాష్ట్ర ప్రాంతాలతో పాటు కృష్ణా, ఉభయగోదావరి తదితర ప్రాంతాల్లో అరటి దిగుబడులు లేకపోవడంతో ప్రస్తుత మార్కెట్‌లో రాయలసీమలో పండే అరటికి మంచి గిరాకీ ఉంది. కేరళ, తమిళనాడు, ఢిల్లీ, తెలంగాణా రాష్ట్రాలకు చెందిన వ్యాపారులు పులివెందుల ప్రాంతానికి వచ్చి అరటికాయలను కొనుగోలు చేస్తుంటారు. దీంతో ఢిల్లీ గల్లీలో కూడా పులివెందుల అరటికి మంచి డిమాండ్ ఉందని రైతులు అంటున్నారు.

నేడు హనుమజ్జయంతి ఉత్సవాలు

పులివెందుల టౌన్ : హనుమజ్జయంతి ఉత్సవాలను పురస్కరించుకుని అంజన్న ఆలయాలు అందంగా ముస్తాబు చేశారు. శనివారం ఉదయం ఆలయాల్లో ప్రత్యేక పూజలు, ఆకుపూజలు, అన్నదాన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. ఆలయాలను ప్రత్యేకంగా విద్యుత్ దీపకాంతులతో, చలువ పందిళ్లతో ముస్తాబు చేశారు. భక్తుల సౌకర్యం కోసం ప్రత్యేక క్యూలైన్లను ఏర్పాటు చేశారు. పట్టణంలోని తూర్పు ఆంజనేయస్వామి, పడమటి అభయాంజనేయస్వామి, కోతి సమాధి ఆంజనేయస్వామి, కదిరి రోడ్డులోని ఆంజనేయస్వామి ఆలయాలను ముస్తాబు చేశారు.

హనుమాన్ శోభయాత్రను విజయవంతం చేయండి

పట్టణంలోని నూతన ఆర్టీసీ బస్టాండు సమీపంలోని ఆంజనేయస్వామి దేవస్థానం నుంచి శనివారం సాయంత్రం 4గంటలకు హిందూ ఐక్యవేధిక ఆధ్వర్యంలో హనుమాన్ శోభయాత్రను ఘనంగా నిర్వహించనున్నారు. హనుమాన్ శోభయాత్రను హిందూవులంతా కలసి కట్టుగా వచ్చి పార్టీలకు అతీతంగా పాల్గొని విజయవంతం చేయాలని నిర్వాహకులు కోరారు.

ప్రారంభమైన హనుమజ్జయంతి వేడుకలు

వేంపల్లె : మండలంలోని మెయిన్ బజార్‌లో ఉన్న అంజనేయస్వామి ఆలయంలో శుక్రవారం నుంచి 2 రోజుల పాటు హనుమజ్జయంతి వేడుకలను ఘనంగా నిర్వహిస్తున్నట్లు ఆలయ ఈఓ విశ్వనాథ్‌రెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శుక్రవారం ఆలయంలో ఆలయ ప్రధాన అర్చకులు హరీ ప్రవీణ్ నేతృత్వంలో అభిషేకం, గణపతి హోమం, అంజనేయస్వామి మూలమంత్ర హోమం, తదితర హోమాలు నిర్వహించారు.



ముస్తాబైన తూర్పు ఆంజనేయస్వామి మూలవిరాట్

పాస్టర్స్ అసోసియేషన్ నూతన కమిటీ ఎన్నిక



ప్రభుదాస్

కమలాపురం : మండల పాస్టర్స్ అసోసియేషన్ నూతన కమిటీ ఎన్నిక శుక్రవారం స్థానిక షాలెం ప్రార్థన మందిరంలో జరిగింది. కమలాపురం మండలంలోని వివిధ చర్చీలకు చెందిన పాస్టరులు హాజరై మండల పాస్టర్స్ అసోసియేషన్ నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కమిటీ అధ్యక్షుడిగా ప్రభుదాస్, వైస్ ప్రెసిడెంట్‌గా హెప్సిబా క్రిష్టియానా, సెక్రటరీగా సునీల్‌దత్, జాయింట్ సెక్రటరీగా స్టీఫెన్, ట్రెజరర్‌గా రాజ్ కుమార్, ఈసీ మెంబర్‌గా రాజు, జాషువా, గౌరవాధ్యక్షుడిగా పాల్‌కుమార్, గౌరవ సలహాదారుడిగా సురేష్ బాబులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. నూతనంగా ఎన్నికైన ప్రెసిడెంట్ ప్రభుదాస్, సెక్రటరీ సునీల్‌దత్‌లు మాట్లాడుతూ క్రైస్తవ సమాజ అభివృద్ధికి, సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. అంతకు ముందు ప్రపంచ శాంతి కోసం ప్రత్యేకంగా ప్రార్థన చేశారు. అనంతరం ప్రేమవిందు ఏర్పాటు చేశారు. సంఘ పెద్దలు, ప్రజలు పాల్గొన్నారు.

ఏపీఈసెట్లో విద్యార్థి ప్రతిభ



దావూద్ హుసేన్

సింహాద్రిపురం : మండలంలోని ప్రభుత్వ పాలిటెక్నిక్ ఈఈఈ విభాగంలో తృతీయ సంవత్సరం చదువుతున్న దావుద్ హుసేన్ 2024 ఏపీ ఈసెట్‌లో 105వ ర్యాంకు సాధించి ప్రతిభకనపరిచి నందుకు ప్రిన్సిపాల్ కే తాతాజీ, ఈఈఈ హెచ్‌ఓడీ డాక్టర్ శివశంకర్, అధ్యాపకులు, కళాశాల సిబ్బంది హర్షం వ్యక్తం చేశారు. అనంతరం విద్యార్థి దావూద్‌హుసేన్ మాట్లాడుతూ నా విజాయానికి ప్రొత్సహించిన తల్లిదండ్రులకు, అధ్యాపకులకు ధన్యవాదాలు తెలుపుతున్నానన్నారు.

నిరాశ్రయులకు అన్నదానం

పులివెందుల టౌన్ : స్థానిక నగరిగుట్టలోని నిరాశ్రయుల ఆశ్రమంలో శుక్రవారం అనాథలకు, వృద్ధులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. పట్టణంలోని ఎర్రగుడిపల్లె గ్రామానికి చెందిన రిటైర్డ్ ఏఎస్ఐ బేగల ఓబులు జ్ఞాపకార్థం సతీమణి ఓబులమ్మ కుటుంబ సభ్యులతో కలసి అన్నదానం నిర్వహించారు.

ప్రతి శుక్రవారం డ్రైడే పాటించాలి



నిల్వ ఉన్న నీటిని తొలగిస్తున్న మలేరియా సబ్ యూనిట్ అధికారి సిద్దయ్య

తొండూరు : ప్రతి శుక్రవారం డ్రైడే పాటించాలని మలేరియా సబ్ యూనిట్ అధికారి సిద్దయ్య తెలిపారు. తొండూరు మండల కేంద్రంలో ఫ్రైడే–డ్రైడే కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. గ్రామంలో ప్రజలకు మలేరియా, డెంగ్యూ, చికెన్ గున్యా, వంటి వ్యాధులు గురించి అవగాహన కల్పించామన్నారు. ముఖ్యంగా ప్రజలు ఇంటి పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలన్నారు. ఇంటి లోపల నీరు నిల్వ ఉన్న చోట నీటిలో దోమలు గుడ్లు పెడుతుందన్నారు. దోమ గుడ్ల నుంచి దోమగా మారేందుకు 10 రోజులు సమయం పడుతుందన్నారు. దోమ లార్వగా మారక ముందే 7వ రోజు నీరు నిల్వ ఉంచిన తోట్లు బానలు, డ్రమ్ములలో నిలువ ఉన్న నీరు పారబోయాలన్నారు. బాగా ఆరబెట్టిన తర్వాత నీరు నింపు కోవాలన్నారు. కార్యక్రమంలో హెచ్ఓ రమణమ్మ, ఆరోగ్య కార్యకర్తలు భాస్కర్, పుల్లమ్మ, తదితరులు పాల్గొన్నారు.

5న పర్యావరణ రక్షణపై పోటీలు

కడప కల్చరల్ : కడప నగరానికి చెందిన పర్యావరణ మిత్ర సమూహం సొసైటీ ఆధ్వర్యంలో ఈనెల 5 న వివిధ అంశాల్లో పోటీలు నిర్వహించనున్నట్లు సంస్థ సభ్యులు డాక్టర్ ప్రసాదురెడ్డి తెలిపారు. 5–10 ఏళ్ల లోపు వయస్సుగల విద్యార్థులు పక్షులు వాలిన చెట్టు చిత్రం గీయాల్సి ఉంటుందని, 11–15 సంవత్సరాల వయస్సులోపు వారు నేనైతే చెట్టును ఇలా రక్షిస్తాను అనే అంశంపై, 16–22 సంవత్సరాలలోపు వయస్సుగల విద్యార్థులు మనిషి జీవన చక్రంలో చెట్టు అనే అంశంపైన చిత్రాలు గీయాల్సి ఉంటుందన్నారు. 23 సంవత్సరాల పైబడి వయస్సుగల వారు మనిషికి చెట్టే ఆధారం అనే అంశంపై చిత్రం గీయాల్సి ఉంటుందని తెలిపారు. ఈ నాలుగు విభాగాల్లో ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులతోపాటు ప్రోత్సాహక బహుమతులు కూడా ఇస్తామన్నారు. చిత్రం గీసేందుకు అవసరమైన రైటింగ్ ప్యాడ్స్, రంగులు, కుంచెలు తదితర సామాగ్రిని విద్యార్థులే తెచ్చుకోవాలని, బొమ్మ గీసేందుకు ఏ4 సైజ్ డ్రాయింగ్ షీట్‌ను నిర్వాహకులే అందజేస్తారని తెలిపారు. చిత్రం గీసేందుకు రెండు గంటల సమయం ఇస్తామన్నారు. జూన్ 5న ఉదయం 9 నుంచి 11 గంటల్లోపు ఈ పోటీ ఉంటుందన్నారు. అనంతరం ప్రశంసాపత్రాలతోపాటు బహుమతులను కూడా ప్రదానం చేస్తామని వివరించారు. రాయచోటిరోడ్డు ఫ్లై ఓవర్ కింద ఏర్పాటు చేసిన భగత్‌సింగ్ పార్కులో ప్రముఖుల సమక్షంలో బహుమతి ప్రదానం ఉంటుందన్నారు. ఇతర వివరాలకు 62815 60089 నెంబరులో సంప్రదించాలని సూచించారు.

కార్పొరేట్ విద్యా సంస్థలపై చర్యలు తీసుకోవాలి

కడప వైఎస్ఆర్ సర్కిల్: నగరంలో దుర్గమ్మ గుడి వద్ద ప్రభుత్వ గుర్తింపు లేకుండా తల్లిదండ్రులను మోసం చేసి ముందస్తు అడ్మిషన్లు నిర్వహిస్తున్న నారాయణ కార్పొరేటు స్కూల్ యాజమాన్యం పై చర్యలు తీసుకోవాలని ఎస్ఎఫ్ఐ, డీవైఎఫ్ఐ నాయకులు రాహుల్, వీరణాల శివకుమార్ డిమాండ్ చేశారు. శుక్రవారం అనుమతి లేకుండా నడుస్తున్న నారాయణ కార్పొరేట్ స్కూల్ ఎదుట ఎస్ఎఫ్ఐ, డీవైఎఫ్ఐ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం చేపట్టారు. ఎస్ఎఫ్ఐ, డీవైఎఫ్ఐ నాయకులు రాజేంద్ర ప్రసాద్, రాజశేఖర్ మనోజ్ పాల్గొన్నారు.

4న ప్రొద్దుటూరులో ఆంక్షలు

ప్రొద్దుటూరు క్రైం : ఎన్నికల కౌంటింగ్ నేపథ్యంలో జూన్ 4న ప్రొద్దుటూరులో పూర్తి స్థాయిలో ఆంక్షలు విధిస్తున్నట్లు డీఎస్పీ మురళీధర్ తెలిపారు. శుక్రవారం సాయంత్రం డీఎస్పీ విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఒక ప్రణాళిక ప్రకారం పోలీసు బందోబస్తు ఏర్పాటు చేస్తున్నామన్నారు. కౌంటింగ్ రోజు విజయోత్సవ ర్యాలీలను పూర్తిగా నిషేధించామన్నారు. 6వ తేది వరకు ఎన్నికల కోడ్ అమలులో ఉంటుందని, ఎవరు కోడ్ ఉల్లంఘించినా కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. ప్రొద్దుటూరు పట్టణంతోపాటు రూరల్, రాజుపాళెం మండలాలను 25 సెక్టార్లుగా విభజించామన్నారు. ఒక్కో సెక్టార్‌కు ఒక అధికారిని కేటాయించి 10 మంది సిబ్బందితో బందోబస్తు చేపట్టినట్లు పేర్కొన్నారు. సమస్యాత్మ వార్డులు, గ్రామాలను గుర్తించి పికెట్లను ఏర్పాటు చేశామన్నారు.

3వ తేది నుంచి 4 వరకు ప్రొద్దుటూరు పోలీసుల ఆధీనంలో ఉంటుందన్నారు. 4న గ్రామాల నుంచి ప్రొద్దుటూరుకు ఎవ్వరూ రావద్దని, పట్టణంలో పూర్తిగా కర్ఫ్యూ వాతావరణం ఉంటుందని సూచించారు.

కేంద్ర కారాగారం పరిశీలన

కడప అర్బన్: జాతీయ న్యాయ సేవాధికార సంస్థ, రాష్ట్ర న్యాయసేవాధికార సంస్థ సూచనల మేరకు జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో శుక్రవారం అధికారులు, ప్రతినిధులు కడప కేంద్ర కారాగారం సందర్శించారు. ఈ సందర్భంగా కారాగారం పరిసరాలను, వసతిగదులను, వంటగదిని, టాయిలెట్స్‌లను వారు పరిశీలించారు. అనంతరం రిజిస్టర్‌లను తనిఖీ చేశారు. ఖైదీలకు అందుతున్న సదుపాయాలను అడిగి తెలుసుకున్నారు. కడపలోని పురుషుల కేంద్ర కారాగారంతో పాటు, ప్రత్యేక మహిళా కారాగారం, అన్నమయ్య జిల్లా రాయచోటి సబ్ జైలును పరిశీలించారు.

పర్యావరణ పరిరక్షణపై చైతన్యం అవసరం

– ప్రిన్సిపాల్ డా. వి. సలీంబాషా



మాట్లాడుతున్న కళాశాల ప్రిన్సిపాల్ సలీంబాషా

వైవీయూ : పర్యావరణ పరిరక్షణ కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఎస్‌కేఆర్ అండ్ ఎస్‌కేఆర్ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డా. వేమల సలీంబాషా పేర్కొన్నారు. శుక్రవారం కడప నగరంలోని ఎస్‌కేఆర్ అండ్ ఎస్‌కేఆర్ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో ఆంధ్రప్రదేశ్ పొల్యూషన్ కంట్రోల్ బోర్డు కడప ప్రాంతీయ కార్యాలయం ఆధ్వర్యంలో విద్యార్థులకు వ్యాసరచన, వక్తృత్వ, క్విజ్ పోటీలు నిర్వహించారు.

ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత అన్నారు. ఇందుకోసం కాలుష్య నియంత్రణ మండలి చైతన్య కార్యక్రమాలు నిర్వహించడం అభినందనీయమన్నారు. ఏపీ కాలుష్య నియంత్రణ మండలి కడప ప్రాంతీయ కార్యాలయం ఎన్విరాన్‌మెంటల్ ఇంజినీర్ డాక్టర్ పి. శ్రీనివాసరావు మాట్లాడుతూ జూన్ 5వ తేదీన ప్రపంచ పర్యావరణ దినోత్సవం పురస్కరించుకుని విద్యార్థులకు పోటీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. పోటీల్లో విజేతలకు జూన్ 5వ తేదీన జిల్లా కలెక్టర్, ఇతర అధికారుల చేతుల మీదుగా బహుమతి ప్రదానోత్సవ కార్యక్రమం నిర్వహిస్తామని తెలిపారు. భూ పునరుద్ధరణ, ఎడారీకరణ, కరువు స్థితిస్థాపకత, 'మనభూమి – మన భవిష్యత్తు' నినాదంతో ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని నిర్వహించుకుంటున్నట్లు ఆయన తెలిపారు. అనంతరం విద్యార్థులకు పాఠశాల స్థాయి, కళాశాల స్థాయి కేటగిరీలుగా పోటీలు నిర్వహించారు. కాంపిటీషన్ సెలక్షన్ కమిటీ చైర్మన్ డా. పి. సుబ్రమణ్యం, సభ్యులు రాజశేఖరరెడ్డి, నాగేంద్రకుమార్, రవిశేఖర్, ఎన్విరాన్‌మెంటల్ సహాయ ఇంజినీర్ అనిల్‌కుమార్‌రెడ్డి, ఎన్‌జీఓ ప్రతినిధి మునెయ్య, కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

4న జమ్మలమడుగులో కర్ఫ్యూ



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న డీఎస్పీ యశ్వంత్

జమ్మలమడుగు రూరల్ : ఈనెల 4వ తేదీన కడపలో ఎన్నికల కౌంటింగ్ ఉండటం వల్ల 4వ తేదీ జమ్మలమడుగులో కర్ఫ్యూ ఉంటుందని జమ్మలమడుగు డీఎస్పీ డాక్టర్ టీడీ యశ్వంత్ తెలిపారు. శుక్రవారం పట్టణ పోలీస్‌స్టేషన్‌లో ట్రైనీ డీఎస్పీ శ్రీకాంత్ సీఐ కరుణాకర్‌తో కలసి విలేకరుల సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ ఎన్నికల కోడ్ అమలులో ఉన్నందున ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ముందస్తు జాగ్రత్తగా జమ్మలమడుగులో ఎటువంటి గొడవలు జరుగకుండా అన్ని చర్యలు తీసుకుంటున్నామన్నారు. పట్టణంలో కొత్తవారు ఎవరు ప్రవేశించకుండా చెక్‌పోస్టులు ఏర్పాటు చేస్తామన్నారు. సోషియల్ మీడియాలో ఎన్నికలకు సంబంధించి ఎటువంటి వీడియోలు పెట్టరాదన్నారు. అలా ఎవరైన అతిక్రమిస్తే కేసులు నమోదుచేస్తామన్నారు. ఇప్పటికే అనుమానం ఉన్న రౌడీషీటర్లను అదుపులోకి తీసుకున్నామన్నారు. జమ్మలమడుగు, ఎర్రగుంట్లలో పార్టీ కార్యాలయాలు ఉన్నందున భారీ బందోబస్తు ఏర్పాటు చేస్తామన్నారు. 4వ తేదీ 14 మొబైల్ పార్టీలు బందోబస్తును పర్యవేక్షిస్తారన్నారు. ఆరోజు వ్యాపారస్థులు దుకాణాలు తెరవకుండా పోలీసులకు సహకరించాలని ఆయన పిలుపునిచ్చారు. విజయోత్సవ ర్యాలీలు, బాణసంచా కాల్చడం చేయరాదన్నారు. పెట్రోల్ బంక్‌ల యజామానులు బాటిళ్లకు పెట్రోల్ పట్టరాదన్నారు. కార్యక్రమంలో ఎస్ఐ కల్పన, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

భోజన తయారీలో పరిశుభ్రతను పాటించాలి



విజేతలకు బహుమతులు అందచేస్తున్న ఎంఈవోలు

వల్లూరు : ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు అందించే మధ్యాహ్న భోజన తయారీలో పరిశుభ్రతతో పాటు నాణ్యతకు ప్రాధాన్యత ఇవ్వాలని మండల విద్యాశాఖ అధికారులు లిల్లెమ్మ, విజయరెడ్డి తెలిపారు. గంగాయపల్లెలో వున్న ఏపీ మోడల్ స్కూల్‌లో శుక్రవారం మధ్యాహ్న భోజన వంట ఏజన్సీల నిర్వాహకులకు ఒక రోజు శిక్షణ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కూరగాయలను శుభ్రంగా కడిగి వంట చేయాలన్నారు. ప్రభుత్వం నిర్దేశించిన మెనూను ఎలా అమలు చేయాలో రిసోర్స్ పర్సన్ శివకుమార్‌రాజు వివరించారు. వంట చేసే విధానాన్ని గురించి రాష్ట్రస్థాయి శిక్షణ కార్యక్రమంలో పాల్గొన్న రిసోర్స్ పర్సన్ రిహానా వివరించారు. అనంతరం వంట ఏజన్సీల నిర్వాహకులకు, సహాయకులకు వంటల పోటీలను నిర్వహించారు. వెంకటాపురం ప్రాథమిక పాఠశాల వంట ఏజన్సీ నిర్వాహకురాలు శ్రీలత మొదటి బహుమతిని గెలుపొందారు. వల్లూరు మెయిన్ ప్రాథమిక పాఠశాల వంట ఏజన్సీ నిర్వాహకురాలు లక్ష్మిదేవి ద్వితీయ బహుమతిని, గంగాయపల్లె జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల వంట ఏజన్సీ నిర్వాహకురాలు దిల్షాద్ తృతీయ బహమతిని పొందారు. కార్యక్రమంలో ఎంఆర్‌సీ సిబ్బంది పాల్గొన్నారు.

దివ్యాంగ పిల్లల నమోదుపై సర్వే



ప్రత్యేక అవసరాలు గల పిల్లలతో అధికారులు

చెన్నూరు : మండలంలో దివ్యాంగ పిల్లల నమోదు సర్వేను సమగ్ర శిక్ష స్టేట్ ప్రాజెక్ట్ డైరెక్టర్ ఆదేశాల మేరకు మండల విద్యాశాఖ అధికారులు గంగిరెడ్డి, సునీతల ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నట్లు భవిత కేంద్రం ఉపాధ్యాయురాళ్లు టి.శ్రీదేవి, జె.కళావతిలు తెలిపారు. శుక్రవారం కొండపేటలోని అంగన్‌వాడీ కేంద్రాల్లో దివ్యాంగ పిల్లల నమోదు సర్వే నిర్వహించారు. ఒక సంవత్సరం వయసు నుంచి 18 సంవత్సరాల వయసుగల పిల్లలను గుర్తించి వారిని దగ్గర్లోని ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించడం జరుగుతుందన్నారు. అలాగే భవిత కేంద్రంలో బుద్ధి మందత్వ, వినికిడి లోపం, దృష్టిలోపం, చలన వైకల్యం మొత్తం 21 రకాల వైకల్యాలను గుర్తించి వారిని భవిత కేంద్రంలో చేర్పిస్తామన్నారు. భవిత కేంద్రంలో ప్రతి బుధవారం ఫిజియోథెరపీ డాక్టర్ చే ఉచిత వైద్య సేవలు అందిస్తారన్నారు. దివ్యాంగ పిల్లల నమోదు కార్యక్రమం జూన్ నెల 9వ తేదీ వరకు సాగుతుందని వివరించారు.

పొగాకురహిత దినోత్సవంపై అవగాహన



పొగాకుపై అవగాహన కల్పిస్తున్న అధికారులు

సింహాద్రిపురం : పొగాకు రహిత దినోత్సవం పురస్కరించుకుని శుక్రవారం మండలంలోని గురిజాల గ్రామంలో బిదినంచర్ల ఆరోగ్య కేంద్ర విస్తరణ అధికారి సుకుమార్ ఆధ్వర్యంలో పొగాకు వలన జరుగు నష్టాలపై ప్రజలకు అవగాహన సదస్సు ఏర్పాటు చేసి మాట్లాడారు. పొగాకు వలన నోరు, ఊపిరితిత్తులకు క్యాన్సర్ వంటి ఆరోగ్య సమస్యలు వస్తాయన్నారు. అలాగే మనిషి బలహీన పడటం, వ్యాది నిరోధక శక్తి తగ్గిపోతుందన్నారు. పొగాకు వల్ల ప్రపంచ వ్యాప్తంగా ఏడాదికి 80 లక్షల మంది మృత్యువాత పడుతున్నారన్నారు. చేడు అలవాట్లకు దూరంగా ఉండాలన్నారు. అనంతరం గ్రామంలో ర్యాలీ నిర్వహించి కర పత్రాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఏఎన్ఎంలు రమాదేవి, లీల, ఆశా కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

పొగాకును కాల్చితే.. అది జీవితాన్ని కాలుస్తుంది



ర్యాలీ చేస్తున్న వైద్య సిబ్బంది

చాపాడు : పొగాకును కాల్చితే.. అది జీవితాన్ని కాలుస్తుందని మండల వైద్యాధికారి డాక్టర్ రాజేష్ కుమార్ అన్నారు. మండల పరిధిలోని చాపాడు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, నక్కలదిన్నెలోని ఆరోగ్య కేంద్రంలో పొగాకు వ్యతిరేక దినోత్సవ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయా ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో వైద్యాధికారులు డాక్టర్లు రాజేష్ కుమార్, కావ్యమాధురి మాట్లాడుతూ పొగాకు ఉత్పత్తులైన సిగరెట్లు, బీడీలు, గుట్కా, చుట్టలు కాల్చితే అవి జీవితాన్ని కాల్చివేస్తాయని పేర్కొన్నారు. 13–15 ఏళ్ల వయసు కలిగిన విద్యార్థులు సిగరెట్లు, బీడీలు, గుట్కా లాంటి వాటిని వినియోగిస్తున్నారని, 38 శాతం సిగరెట్లు, 47 శాతం బీడీలు, 52 శాతం పొగలేని పొగాకు వినియోగాన్ని ప్రారంభిస్తున్నారన్నారు. వీటి వల్ల ఊపరితిత్తుల క్యాన్సర్, నోటి క్యాన్సర్, కడుపు క్యాన్సర్, లుకేమియా లాంటి వ్యాధులు వ్యాపిస్తాయన్నారు. దీంతోపాటు సక్రమంగా రక్తప్రసరణ జరగదని, రుచి, వాసన గ్రహణ శక్తిని కోల్పోతారని తెలిపారు. పొగాకు మానేయడం వలన వీటన్నింటికి దూరమవుతారని సూచించారు. అలాగే సిద్ధారెడ్డిపల్లెలో డాక్టర్ శ్రీవాణి పొగాకు వ్యతిరేక దినోత్సవ ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమాల్లో వైద్యాధికారి ఓబులేసు, ఎంపీహెచ్ఈఓ రాఘవయ్య, సూపర్‌వైజర్లు సరస్వతి, బాబురెడ్డి, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.